## క్లుప్తంగా

### సమాధుల పండుగ


సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న డాల్విన్ క్రిష్టియన్ దాస్

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు నగరం కన్నన్‌కాలేజీ సమీపంలోని క్రైస్తవుల శ్మశానంలో శనివారం సమాధుల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఏటా నవంబర్ 2న క్రైస్తవులు సమాధుల పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. అందులోభాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. సమాధుల పండుగ ప్రాముఖ్యతను వివరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. క్రైస్తవులు వారి కుటుంబీకుల సమాధులను శుభ్రం చేసి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఇష్టమైన పదార్థాలను సమాధుల వద్ద పెట్టి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిష్టియన్ దాస్, సభ్యులు మంజునాథ్, సురేంద్రకుమార్, జ్ఞాన ప్రకాష్, నోబుల్, ప్రేమ్ మనోహర్, జైకుమార్, సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి వద్దకే వైద్యం


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమహేష్


**గుడిపాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. బసవాపల్లెలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ పేషెంట్లకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 58 మంది రోగులు పాల్గొన్నారు. మంచానపడ్డ రోగులకు ఇంటివద్దే వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కోమల, చంద్రశేఖర్, రోస్‌లిన్, పంకజ తదితరులు పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం


పేదలకు అన్నదానం చేస్తున్న కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు

**కార్వేటినగరం:** మండలంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన కృష్ణమూర్తి, శ్రీదేవి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం , శనివారాలే కాకుండా రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు.

### ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు


కుంకీలను పరిశీలిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ యశోద

**రామకుప్పం:** మండలంలోని ననియాల ఎకో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అనంతపురం ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ యశోదభాయ్ తెలిపారు. శనివారం జిల్లా అటవీ అధికారి భరణితో కలసి ఆమె ఎకో టూరిజంను సందర్శించారు. ఈ సందర్భంగా టూరిజంలో ఎకో పార్కు, జంగిల్ సఫారీ, కుంకీలను పరిశీలించారు. అదేవిధంగా బేస్‌క్యాంపు సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

### తెరుచుకోని రేషన్ షాప్

**గంగవరం:** మండలంలోని కొత్తపల్లిలో ఉన్న చౌకదుకాణం రెండు రోజులుగా తెరవకపోవడంతో బియ్యం అందక అక్కడి లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. గత ఒకటో తేదీ నుంచి షాపులో రేషన్ బియ్యం వేయాల్సి ఉండగా శనివారం 2వ తేదీ అయినా షాపులో రేషన్ పంపిణీ జరగలేదు. దీంతో అక్కడి రేషన్ దుకాణం పరిధిలోని కార్డుదారులకు సమయానికి రేషన్ అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తపల్లికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేసీపెంట, 4 కిలోమీటర్లు దూరంలోని మంజునాథకాలనీ, కిలోమీటరు దూరంలో ఉన్న పాతకీలపట్ల గ్రామాల ప్రజలందరూ ఇక్కడి రేషన్ దుకాణంలోనే బియ్యం తీసుకోవాలి. అయితే ఇంటింటికీ బియ్యం పంపిణీ పథకం రద్దు వల్ల ఇటు షాపు వద్ద బియ్యం ఇవ్వక, అటు ఊళ్లలోకి రేషన్ వాహనం సైతం వెళ్లకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బంది తప్పలేదు. ఈ కూటమి ప్రభుత్వానికి పేద ప్రజలపై కాసంతైనా కనికరం ఉండుంటే ప్రజలకు ఇలాంటి అవస్థలు ఉండవు. రెండు రోజులైనా రేషన్ ఎందుకు ఇవ్వలేదో డీలర్‌ను ప్రశ్నించాల్సిన సివిల్ సప్లైస్ అధికారులు నిమ్మకుండి పోవడంలో ఆంతర్యం ఏమిటో..


రైల్వే ఆవరణలో ఉన్న చెత్తాచెదారం


రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఏకైక మార్గం


శిథిలావస్థకు చేరిన విశ్రాంతి గది

# అధ్వానంగా పూతలపట్టు రైల్వేస్టేషన్

- స్టేషన్‌కు వెళ్లే మార్గంలో పెరిగిన పిచ్చిమొక్కలు
- స్టేషన్ ఎదుటే పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు

**పూతలపట్టు:** మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్రాంగణం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. మండలంలోని వడ్డేపల్లి సమీపంలో ఉన్న రైల్వే స్టేషన్ ప్రాంగణం చెత్తతో పేరుకుపోయింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఇక్కడ కానరావడం లేదు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో పూర్తిగా చెత్తచెదారంతో నిండి ఉంది. ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు పారబోయడం వల్ల ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముక్కు మూసుకొని రైల్వే స్టేషన్‌కు రావలసిన దుస్థితి ఏర్పడింది. స్టేషన్ ప్రాంతంలోని రోడ్డు సరిగా లేక గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. స్టేషన్ ప్రాంతంలో పిచ్చి మొక్కలు కుళ్లిపోవడం, వ్యర్థపు నీరు నిండిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణికులకు దోమల దండయాత్ర తప్పడం లేదు. ప్లాట్‌ఫారాలపై ఫాగింగ్ చేసి దోమల బెడదను తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



పూతలపట్టు రైల్వే స్టేషన్

**పాములకు ఆవాసాలుగా స్టేషన్ ప్రాంతం**

వడ్డేపల్లి ప్రాంతంలోని రైల్వేస్టేషన్ మార్గంలో ఎటుచూసినా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. స్టేషన్‌కు వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు లేక మట్టి రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదురవుతున్నారు. స్టేషన్ పక్కన రైల్వే సంస్థ విశ్రాంతిగది ఉంది. ఆ గది చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఆ పొదల్లో పాములు నివాసముంటున్నాయి. ఇక్కడి నుంచి పాములు సమీపంలోని నివాసాల్లోకి చొరబడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ వరకు సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. రైల్వే అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మొత్తంగా ఈ స్టేషన్ ముళ్లపొదలు, గుంతల రోడ్లు, పాముల మధ్య ఉంది. ఈ భయంతో రైలు ప్రయాణికులు కూడా ఈ స్టేషన్‌కి రావడం లేదు. స్థానికులు, ప్రయాణికులు రైల్వే సిబ్బందికి సమస్యలపై వివరిస్తే తమకు సంబంధం లేదనట్లు వ్యవహరిస్తున్నారు. వర్షం వస్తే ఆ దారిలో ప్రయాణించడాని అష్టకష్టాలు పడాల్సి ఉంటుంది. రాత్రి సమయాల్లో అయితే వీధి లైట్లు కూడా ఉండవు. చీకటి వేళ ఆ మార్గంలో వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే.

### నేడు 17వ మహాసభలు

**పూతలపట్టు:** యూనియన్ టీచర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 17వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు పతాకావిష్కరణ చేసిన అనంతరం కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, సభ్యులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

### బాలికలకు రక్షణ కరువు


కలత్తూరు కృపాలక్ష్మి

**శ్రీరంగరాజపురం:** కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కరువైందని, ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట అఘాయిత్యాలు, అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి, రాష్ట్ర మహిళా నాయకురాలు కలత్తూరు కృపాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడేళ్ల చిన్నారిపై మానవ మృగం అత్యాచారం చేసి హత్య చేయడం హేయమైన చర్య అని వాపోయారు. ఇందుకు పోలీసులు, ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశా చట్టం, దిశా యాప్‌ను నిర్వీర్యం చేయడంపై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై లేదన్నారు. రాష్ట్రం అత్యాచార ఆంధ్రప్రదేశ్‌గా మారిందని విమర్శించారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర హోమ్ మంత్రిగా ఉన్న అనిత కళ్లు మూసుకుందా అని నిలదీశారు. చిన్నారిపై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడిని అరెస్టుచేసి బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

## కరువు మండలంగా ప్రకటించాలి

**బంగారుపాళెం:** మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం మాట్లాడుతూ, ప్రభుత్వం ఇటీవల జిల్లాలో కరువు మండలాలను ప్రకటించిందన్నారు. జిల్లాలో అతిపెద్ద మండలంగా బంగారుపాళెం ఉందన్నారు. 41 గ్రామ పంచాయతీలు, 180 గ్రామాలు ఉన్నాయన్నారు. మండలంలో చాలా మంది రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయం చేయడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈ ఏడాది సగటు వర్షపాతం అంతంత మాత్రమేనన్నారు. గత ఏడాది కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు చేరిందన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు మండలంలో వంకలు వాగులు కూడా సాగలేదని గుర్తుచేశారు. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడిన దాఖలాలు కనిపించడంలేదన్నారు. రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సాగుకు పెట్టిన ఖర్చు కూడా అందడం లేదని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం బంగారుపాళెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని కోరారు.

### యాజమాన్య పద్ధతులతో వేరుశనగలో అధిక దిగుబడి


ఆర్కేవీబీ పేట వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రాస్ కేవీకే శాస్త్రవేతలు

**కార్వేటినగరం:** వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని రాస్ కేవీకే శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం ఆర్కేవీబీపేట, రాజుల కండ్రిగ, కేశవకుప్పం గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ట్యాగ్ 73 వేరుశనగ పంట ప్రధాన తెగుళ్లను తట్టుకుని హెక్టారుకు ఖరీఫ్‌లో 20 నుంచి 25, రబీలో 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు అందించే స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. అలాగే వివిధ రకాల పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేతలు డాక్టర్ దివ్య, రామకుమార్, చంద్రమౌళిరెడ్డి, దామురాజు, చిరంజీవి, ప్రసాద్, హరి, మాధవ పాల్గొన్నారు.

### పకడ్బందీగా పశు గణన చేయాలి

**చిత్తూరు రూరల్:** పశు గణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ ఆదేశించారు. చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లెలో చేపడుతున్న పశు గణన సర్వేను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే పని తీరు, విధివిధానాలపై ఆరా తీశారు. ఆన్‌లైన్ నమోదును క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటింటా వెళ్లి సమగ్ర సర్వే చేయాలన్నారు. కచ్చితమైన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

## అధికారులు సమయ పాలన పాటించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ రవికుమార్‌నాయుడు

**బంగారుపాళెం:** విధి నిర్వహణలో అధికారులు సమయపాలన పాటించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యదర్శి రవికుమార్ నాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను ఆవరణను పరిశీలించారు. కార్యాలయంలో ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పింఛన్ల పంపిణీపై ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లేడుపల్లె గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ పరిధిలో సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సమయ పాలన పాటించి సకాలంలో విధులకు హాజరుకావాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

## చిన్నతనం నుంచే సామాజిక సేవ అలవర్చుకోవాలి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రాములు

**చిత్తూరు కలెక్టరేట్:** విద్యార్థులు చిన్నతనం నుంచే సామాజిక సేవను అలవర్చుకోవాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాములు అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం కొంగారెడ్డిపల్లెలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అవినీతి రహిత దేశం కోసం కృషి చేయాలన్నారు. చిన్నతనం నుంచే సేవా గుణం అలవాటు చేసుకోవాలని చెప్పారు. నిజాయితీగా ఉంటూ దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గీతాంజలి, అసిస్టెంట్ మేనేజర్ బరక్‌తుల్లా, జూనియర్ ఇంజనీర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఫెన్సింగ్‌లో ఐరాల విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

**ఐరాల:** రాష్ట్ర స్థాయి అండర్–14 ఫెన్సింగ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ ఇటీవల నంద్యాల డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–14 బాలికల జట్టు ఈవెంట్ సాబర్ విభాగంలో తమ విద్యార్థిని గాయత్రి రజత పతకం, బాలుర ఈపీఈఈ విభాగంలో పవన్‌కుమార్ కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. క్రీడాకారులను, పీడీ దేవాను ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్, ఎస్‌ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

## అ'పూర్వ' సమ్మేళనం


హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**తవణంపల్లె:** మండల కేంద్రంలోని హైస్కూల్లో 2001–02 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం అదే స్కూల్లో ఆత్మీయంగా కలుసుకున్నారు. వారికి విద్య నేర్పిన గురువులను పూజించి పాదాభి వందనం చేశారు. గురువులకు శాలవలు కప్పి, పూలదండలు వేశారు. పూర్వ విద్యార్థులు బాల్యంలోని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి సంతోషంగా గడిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు సీఎస్‌ఆర్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

**గుడిపాల:** మండలంలోని సీఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల అధినేత లోకేష్ తెలిపారు. మెసానికల్ క్రీడా మైదానంలో జరిగిన అండర్–19 ఖోఖో పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికాంత్, జానీణి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారన్నారు. తిరుపతిలోని మంగళం జిల్లా ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–17 బేస్‌బాల్ పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జ్యోత్స్న గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. సీఎస్‌ఆర్ పాఠశాలలోని విద్యార్థులు అండర్–14 బేస్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతి చదువుతున్న గౌతమ్, మనోజ్, ఆరవ తరగతి చదువుతున్న లిలిధర్ ఎంపికయ్యారన్నారు.

# స్టాంప్ పేపర్లు వచ్చాయి


స్టాంప్ పేపర్స్‌తో నిండి ఉన్న బాక్సులు



వంద రూపాయల స్టాంప్ పేపర్

- ప్రస్తుతం రూ.50, రూ.100
- ఇక అధిక ధరలకు అమ్ముకోవచ్చు
- త్వరలో ఈ–స్టాంపింగ్‌కు మంగళం
- రేపటి నుంచి విక్రయాలు

**చిత్తూరు కార్పొరేషన్:** గతంలో చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేసిన అహమ్మద్ నిబంధనలకు విరుద్ధంగా పదివేల రూపాయల విలువైన స్టాంప్ పేపర్స్‌ను అమ్ముకున్నాడు.

అక్రమ రిజిస్ట్రేషన్‌కు వినియోగించిన స్టాంప్ పేపర్స్ అమ్మినందుకు స్టాంప్‌వెండర్ తాలిమా లైసెన్స్‌ను అప్పట్లో తాత్కాలికంగా రద్దు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంప్స్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, రైటర్లు గడిచిన తేదీలతో అధిక ధరలకు స్టాంప్ పేపర్లు అమ్ముకోవడం వ్యాపారంగా మారింది. దీంతో గతంలో క్రమేపీ స్టాంప్ పేపర్స్ విక్రయాలు తగ్గించి, అక్రమాల నివారణకు ఈ–స్టాంపింగ్ విధానంను అమల్లోకి తెచ్చారు. అందులోని లోటుపాట్లు సరిచేసి మార్పు చేయాలని చూశారు. ప్రభుత్వం మారడంతో తిరిగి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంప్‌పేపర్స్ విక్రయాలు జరపనున్నారు. విజయవాడ నుంచి రూ.50 విలువైన నాన్‌జుడీషియల్ స్టాంప్ పేపర్లు రూ.30 వేలు, రూ.100 పేపర్స్ 40వేలు తీసుకొచ్చారు. వీటిని జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేశారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో అమ్మకాలు చేపట్టనున్నారు.

**ఈ–స్టాంపింగ్‌కు మంగళం**

స్టాంప్ పేపర్స్‌కు ప్రత్యామ్నాయంగా ఈ–స్టాంప్స్‌ను తీసుకొచ్చారు. వాటిని అధిక ధరలకు అమ్ముతుండడంతో అందులో మార్పులు తీసుకురావాలని గతంలో చూశారు. జిల్లాకు 11 లక్షల పేపర్లు అవసరమని అధికారులు ఇండెంట్ పెట్టగా అందులో రూ.50, రూ.100 పేపర్లు 70 వేలు వచ్చాయి. మిగిలినవి దశలవారీగా పంపనున్నారు. జిల్లాకు రూ.100 విలువ చేసేవి స్టాంపు పేపర్లు 5 లక్షలు, రూ.50 విలువ చేసే స్టాంపులు నాలుగు లక్షలు, రూ.20 స్టాంపులు రెండు లక్షలు అవసరమని అధికారులు నివేదిక పంపినట్లు సమాచారం. ప్రత్యామ్నాయంగా ఈ–స్టాంప్స్ వాడవచ్చు. కానీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్‌పేపర్స్ అమ్మకంలో వచ్చాక మెల్లగా ఈ–స్టాంప్స్ ప్రభావం తగ్గనుంది. దీంతో భవిష్యత్‌లో విక్రయాలకు మంగళం పాడనున్నారు.

**అదనపు ధరలే లక్ష్యం**

కొన్ని లోన్స్, అక్రమ రిజిస్ట్రేషన్స్ గడిచిన తేదీల స్టాంప్ పేపర్స్ అవసరం. ఇదే ఉద్యోగులు, వెండర్లకు వరంగా మారింది. దీనికి తోడు లాయర్స్, వడ్డీ వ్యాపారులు ఎక్కువగా స్టాంప్స్ పేపర్స్ వాడుతారు. వారికి ఉద్యోగులు బల్క్ కాపీలు అమ్మేసి లాభపడుతున్నారు. దీంతో వినియోగదారుడు స్టాంప్ పేపర్స్ కొరతతో ఇబ్బంది పడి వెండర్లను ఆశ్రయిస్తున్నారు.

## గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


గర్భిణికి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పూర్ణలత

**ఐరాల:** నెలలు నిండిన గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో బాలింతలు, వృద్ధులు, పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారంతో పాటు ఆశాలు పంపిణీ చేసే ఐరన్ మాత్రలను తప్పక తాగాలన్నారు. విధిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టిస్తే బిడ్డకు శ్రేయస్కరమని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


పోలీస్ అధికారులతో సమావేశమైన జడ్జి లిఖిత

**పలమనేరు:** పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత సూచించారు. స్థానిక కోర్టులో శనివారం కోర్టు పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, న్యాయవాదులతో ఇందుకు సంబంధించిన సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గం కాబట్టి కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా ఉండేలా జీవించాలన్నారు. ఇందులో ప్రి లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస, సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి కృషిచేయాలని సూచించారు.